# వన్యప్రాణుల ఉక్కిరిబిక్కిరి

వేసవి తాపం ప్రజలనే కాదు వన్యప్రాణులను సైతం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గత ఐదు నెలల నుంచి వరుణ దేవుడి కరుణ లేకపోవడంతో అడవుల్లో ఎటు చూసినా చుక్కనీరు లేదు. దాహం తీర్చుకునేందుకు గ్రామాల్లోకి వస్తున్న జింకలను కుక్కలు వెంబడించి చంపేస్తున్నాయి. రోడ్డు దాటుతూ గాయాల పాలైన జింకలను అటుగా వెళ్లే ప్రయాణికులు క్షణాల్లో మాయం చేసేస్తున్నారు. వన్యప్రాణులను కాపాడాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి.

- దాహార్తి తీర్చుకునేందుకు గ్రామాల్లోకి వస్తున్న జింకలు
- రోడ్డు ప్రమాదాలు, కుక్కల దాడుల్లో జింకల మృత్యువాత
- పట్టించుకోని అటవీశాఖ అధికారులు


ఇటీవల తిక్కవరప్పాడులో కుక్కల దాడిలో మృతిచెందిన జింక


వెంకటాచలం సమీపంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జింక

వెంకటాచలం : మండల పరిధిలో 2,500 హెక్టార్లలో అటవీ భూములున్నాయి. ఇందులో వేలాదిగా జింకలు, దుప్పిలు ఉన్నాయి. అయితే ఈ ఏడాది వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో అటవీ భూముల్లో ఎక్కడా చుక్కనీరు లేదు. ప్రస్తుత అక్టోబరు నెలలోనూ ఉష్ణోగ్రతలు తగ్గకపోవడం, నీటి సౌకర్యం లేకపోవడంతో దాహార్తి తీర్చుకునేందుకు జింకలు, దుప్పిలు గ్రామాల్లోకి వస్తున్నాయి. గ్రామాల్లోకి వచ్చే సందర్భాల్లో కొన్ని వాహనాలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందుతున్నాయి. మరికొన్ని గ్రామాల్లోకి చేరుకోగానే వాటిని కుక్కలు వెంబడి చంపేస్తున్నాయి. గత ఐదు నెలల్లో మండలంలో సుమారు 15కుపైగా జింకలు కుక్కలు చేతికి చిక్కి, వివిధ ప్రమాదాల్లో చనిపోయాయి.

**మాయమవుతున్న జింకలు**

దాహార్తి తీర్చుకునేందుకు రోడ్డు దాటుతూ గాయపడిన జింకలు క్షణాల్లో మాయమవుతున్నాయి. వెంకటాచలం నుంచి సర్వేపల్లి, ఈదగాలి గ్రామాల్లో తరచూ రోడ్డు దాటుతూ జింకలు గాయాలపాలవుతున్నాయి. ప్రమాదాల్లో గాయపడిన జింకలను అటుగా వెళ్లే ప్రయాణికులు క్షణాల్లో మాయం చేస్తున్నారు. గతేడాది జనవరి నెలలో వెంకటాచలం సమీపంలో తెల్లవారుజామున ఐదుగంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని రెండు జింకలు గాయపడ్డాయి. ఈవిషయాన్ని గుర్తించిన అటుగా వెళ్లే ప్రయాణికులు రెండు జింకలను రెప్పపాటులో తరలించేశారు. వెంకటాచలం వైపు వెళ్లే ట్రాక్టర్‌లో తీసుకెళ్లారని ప్రయాణికులు చెప్పినా అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు.

## అధికారుల చర్యలేవీ?


కంచె కూడా ఏర్పాటు చేయని వెంకటాచలం సమీపంలోని అటవీ ప్రాంతం

వెంకటాచలం మండలంలో తరచూ జింకలు మృతి చెందుతున్నా అటవీశాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో జింకలు చనిపోవడమే కాక, కొందరు రాత్రి వేళల్లో జింకల వేట కొనసాగిస్తున్నారు. దాహార్తి కోసం రోడ్డు దాటుతున్న జింకలను వేటాడి వాటి మాంసాన్ని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అడవుల్లో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు నీటి గుంతలను ప్రభుత్వం తవ్వించకపోవడంతో జింకలు గ్రామాల వైపు పరుగులు తీస్తూ మృతి చెందుతున్నాయి. అలాగే అటవీ భూముల చుట్టూ కంచె లేకపోవడంతో జింకలు రోడ్డు దాటుతూ చనిపోతున్నాయి. అధికారులు ఇకనైనా వన్యప్రాణాల సంరక్షణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మండల ప్రజలు కోరుతున్నారు.

### వన్యప్రాణుల పరిరక్షణకు చర్యలు

"వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు చేపడుతున్నాం. ఈ ఏడాది ఎండలు అధికంగా ఉండటంతో అడవుల్లో నీరు లేక జింకలు గ్రామాల్లోకి వస్తూ చనిపోతున్నాయి. జింకల సంరక్షణకు నీటి గుంతల ఏర్పాటు గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి జింకల మృతి చెందకుండా చర్యలు చేపడుతాం.
– ఆదిశేషయ్య, ఎఫ్‌బీఓ

## క్లుప్తంగా

### గ్రామ స్వరాజ్య సాకారమే లక్ష్యం


గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

మనుబోలు : గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాకారమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగుదామని ఎంపీపీ గుండాల వజ్రమ్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కార్యదర్శులకు మండల స్థాయి శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి పక్కా ప్రణాళికలు రూపొందించుకుని, అందుకు తగినట్లు పనిచేయాలన్నారు. ఎంఆర్పీ గరుడయ్య మాట్లాడుతూ పారిశుద్ధ్యం, వీధి లైట్లు, తాగునీటి సరఫరా తదితర విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పంచాయతీ విధులు, బాధ్యతలు, పరిపాలన, అధికారాల గురించి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్పీ కో–ఆర్డినేటర్‌లు దీపిక, చెంచుప్రసాద్, దేవసేన, జయంతి, చెంచమ్మ తదితరులు పాల్గొన్నారు.

### గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



పొదలకూరు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో పీఎం సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమం కింద గర్భిణులకు బుధవారం పౌష్టికాహారం అందజేశారు. భారతి హోమ్ కేర్ హెల్త్ సర్వీసెస్ వారి ఆధ్వర్యంలో జిల్లా కుష్టు నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ చేతుల మీదుగా దీనిని అందించారు. చుట్టుపక్కల గ్రామాల్లో ఉన్న గర్భిణులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ యు.ప్రసాద్, వైద్యాధికారులు పద్మావతి, మల్లికార్జునరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, శిరీష, శాస్త్రి, అనూరాధ పాల్గొన్నారు.

### ముత్తుకూరు పొదుపు సభ్యులతో సమావేశం


పొదుపు మహిళలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ అందజేస్తున్న డీసీఓ గుర్రప్ప

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని డీసీఓ కార్యాలయంలో ముత్తుకూరు గ్రామంలోని 49 స్వయం సహాయక బృందాల మహిళా సభ్యులతో బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సంఘ నిర్వహణ, ప్రధాన ఉద్దేశాలు, ఆశయాలు, సభ్యత్వం, సమావేశాలు, ఎన్నికలు, ఆడిటింగ్, వివాదాల పరిష్కారాలపై సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా సహకార శాఖాధికారి (డీసీఓ) గుర్రప్ప మాట్లాడుతూ, పొదుపు సహకార సంఘాలను చట్టబద్ధంగా నిర్వహించాలని సూచించారు. నిబంధనలు తప్పక పాటించాలని తెలియజేశారు. అనంతరం సంఘ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, నిబంధనల పుస్తకాలను బృందాల సభ్యులకు అందజేశారు.

### హా..దుగురే.!

- బైక్‌పై ఐదుగురి ప్రయాణం


నార్తురాజుపాళెం మెయిన్ రోడ్డులో బైక్‌పై ఐదుగురి ప్రయాణం

కొడవలూరు : ప్రమాదకరమని తెలిసినా కొందరు ద్విచక్ర వాహనదారులు నిర్లక్ష్యంగా వాహనాలను నడుపుతున్నారు. ఇద్దరికి మించి ప్రయాణం చేయవద్దని ఎంతగా చెబుతున్నా కొందరు పట్టించుకోవడం లేదు. నార్తురాజుపాళెంలో ఏకంగా ఓ ద్విచక్ర వాహనదారు ఐదుగురితో బుధవారం వెళ్తుండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇలాంటి సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఐదుగురికీ ప్రాణాపాయమని తెలిసినా పట్టించుకోవడం లేదు. ఇద్దరికి మించి ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారికి పోలీసులు అపరాధ రుసుంలు విధిస్తున్నారు. అయినా కొందరిలో మార్పు రావడం లేదు.

### మాలధారణ భక్తులకు అన్నదానం



పొదలకూరు : పట్టణ చుట్టుపక్కల ప్రాంతాలే కాక, గ్రామీణ ప్రాంతాల్లో అయ్యప్ప, శివ, దుర్గాదేవి, విఘ్నేశ్వర మాలధారణలో ఉన్న భక్తులకు మధ్యాహ్నం స్థానిక శివాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఆర్.జయమూర్తిరెడ్డి, మొలబంటి రాములు అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్తీకమాసం ప్రారంభమయ్యేంత వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. తర్వాత మాలధారణ భక్తులకు మరో బృందం అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తుందన్నారు. కార్తీకమాసం పూర్తయ్యేంత వరకు కార్యక్రమాన్ని జరిపిస్తామన్నారు. మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు భోజన ఏర్పాటు ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు.

### డయల్ యువర్ ఆర్టీసీ డీఎం నేడు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కరీమున్నీసా బుధవారం తెలిపారు. ప్రయాణికులు 99592 25645 నంబర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలు, సూచనలు, సలహాలను తెలియజేయాలని కోరారు.

## దేవస్థానం భూములకు కౌలు వేలం

పొదలకూరు : మండలంలోని వావింటపర్తిలోని చెన్నకేశ్వరస్వామి దేవస్థానం భూములకు సంబంధించి కౌలు వేలం పాటలను స్థానిక శివాలయంలో ఈఓ కె.ప్రసాద్‌రెడ్డి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 ఎకరాల మెట్టభూములు వావింటపర్తి గ్రామంలో స్వామికి మాన్యం భూములుగా ఉన్నాయన్నారు. వీటిని కౌలుకు ఇచ్చేందుకు వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వావింటపర్తి, మొగళ్లూరు గ్రామస్తులు పాల్గొన్నారు.


వేలం పాటలు నిర్వహిస్తున్న ఈఓ

### మహిళపై దాడి



కొండాపురం: మహిళపై నలుగురు దాడి చేసి గాయపరిచిన ఘటన నేకునాంపేట పంచాయతీ పరిధిలోని తూర్పుపాళెంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితురాలు పైడి మహాలక్ష్మమ్మ తెలిపిన వివరాల మేరకు.. తూర్పుపాళేనికి చెందిన పైడి మహాలక్ష్మమ్మ, అదే గ్రామానికి చెందిన బొట్లగుంట మధు, రామయ్య, భాగ్యమ్మ, రాణెమ్మ నడుమ చిన్నపాటి వివాదం నెలకొంది. ఈ క్రమంలో నలుగురు ఇటుకతో దాడి చేయడంతో మహాలక్ష్మమ్మ తలకు తీవ్రమైన గాయమైంది. ఆమెను స్థానికులు కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కొండాపురం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది.

## పీహెచ్‌సీలను సద్వినియోగం చేసుకోండి


గర్భిణిని పరీక్షిస్తున్న డాక్టర్ మోహిసినా సుల్తానా

మనుబోలు : ప్రభుత్వ ఆస్పత్రులను సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మోహిసినా సుల్తానా అన్నారు. ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్(పీఎంఎస్ఎంఏ) కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతినెలా 9 లేదా 10వ తేదీల్లో పీహెచ్‌సీలో గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ పరీక్షల్లో రక్తహీనతతో బాధపడుతున్న వారిని, హైరిస్క్‌తో ఉన్న గర్భిణులను గుర్తించి వీరికి ప్రత్యేక వైద్య సదుపాయాలు కల్పిస్తామన్నారు. మాతాశిశు మరణాలను నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పీహెచ్‌సీల్లో కాన్పులు చేయించుకునేందుకు గర్భిణులు ఎటువంటి సంకోచం పెట్టుకోవాల్సిన అవసరం లేదన్నారు. గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా ఆకుకూరలు, తాజా పండ్లు, కూరగాయలు, గుడ్లు, పాలు రోజువారీ ఆహారంలో ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజయ్య, సూపర్‌వైజర్ హైమావతి, రమణయ్య, ఏఎన్ఎం సుభాషిణి, ఎంఎల్‌హెచ్‌పీ కావ్యశ్రీ, శ్రీరమ్య తదితరులు పాల్గొన్నారు.

## అనువైన పంటలను సాగు చేయాలి


పొదలకూరు : మాట్లాడుతున్న ఏడీఏ శివనాయక్


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: అవగాహన కల్పిస్తున్న అధికారులు


ఇందుకూరుపేట : రైతులకు సూచనలు

పొదలకూరు : రైతులు వాతావరణానికి అనువైన పంటల సాగును చేయాల్సిందిగా పొదలకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు కె.శివనాయక్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆర్‌వైపాళెం, మొగళ్లూరు గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో బుధవారం వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ నీటి లభ్యతను బట్టి పంటలను సాగు చేస్తే రైతులు నష్టపోకుండా ఉంటారన్నారు. పచ్చిరొట్ట ఎరువుల ఉపయోగాలు, మినుము, పెసర, వరి విత్తనాల సబ్సిడీ వివరాలను తెలియజేశారు. సమావేశంలో ఉద్యానాధికారి ఈ.ఆనంద్, ఏఓ ఎ.వాసు, ఏఈఓ ఏడుకొండలునాయక్, వీహెచ్‌ఏలు రత్నమ్మ, దీప, రైతుసంఘం నాయకుడు కోడూరు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**రసాయన ఎరువులను తగ్గించాలి**

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : రైతులు రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించాలని మండల ఏఓ సురేంద్రరెడ్డి అన్నారు. మండలంలోని మునులపూడి, శ్రీపురంధరపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేంద్రరెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు ఆసక్తి చూపాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ షేక్.ఆసిమా, వీఏఏ కె.శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

**అందుబాటులో వరి విత్తనాలు**

ఇందుకూరుపేట : బీపీటీ 5204 రకం వరి విత్తనాలు అన్ని రైతుసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయశాఖ అధికారి రఘునాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సోమరాజుపల్లి, నరసాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెటర్నరీ డాక్టర్ అస్లాం మాట్లాడుతూ సబ్సిడీ మీద మినీ గోకులం షెడ్లను రైతులకు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వీఏఏ టి.పెంచలయ్య, వీఎఫ్ఏ హేమ తదితరులు పాల్గొన్నారు.

**రాయితీలను సద్వినియోగం చేసుకోండి**

కొడవలూరు : వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై వరి విత్తనాలను పంపిణీ చేస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ లక్ష్మి కోరారు. మండలంలోని కమ్మపాళెం, రేగడిచెలికలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె కమ్మపాళెంలో మాట్లాడుతూ మండలంలోని అన్ని ఆర్బీకేల్లో బీపీటీ 5204, కేఎన్ఎం 1638 రకాల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. వెటర్నరీ సహాయకుడు రామకృష్ణ మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ ఎ.అనూష, వీఏఏలు ఒ.సుజిత్, డి.నవీన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.


కొడవలూరు: కమ్మపాళెంలో..

## చదువుల తల్లీ.. నమోస్తుతే


పొదలకూరు : సరస్వతీదేవి అలంకారంలో అమ్మవారు


బుచ్చిరెడ్డిపాళెం రూరల్: జొన్నవాడలోని కామాక్షితాయి ఆలయంలో..

**శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం అమ్మవార్లు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు విశేషంగా తరలి వచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.**

పొదలకూరు : పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో సరస్వతి అలంకారంలో అమ్మవారు బుధవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా తన్నీరు రామ్మూర్తి, తన్నీరు సురేష్, జొన్నలగడ్డ బ్రహ్మయ్య వ్యవహరించారు. ఉదయం లలిత సహస్రనామార్చన, ఖడ్గమాల, సరస్వతీ వెండిప్రతిమలు, బంగారు కాసులు, గుండ్లకు వేలం పాటలు నిర్వహించారు. ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు ఆదూరు వెంకటసుబ్బయ్య, రాచపూటి రామలింగయ్య పాల్గొన్నారు.

**విద్యాలక్ష్మిగా అమ్మవారు**

పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న శ్రీలక్ష్మీ గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు విద్యాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా ఆదాల శ్రీనివాసులురెడ్డి–మాధవి, దేవినేని శరత్–శ్రావ్య వ్యహరించారు.

**సామూహిక కుంకుమ పూజలు**

పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి(శివాలయం) ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా తెల్లవారుజామున ప్రధాన అర్చకుడు ప్రసాద్‌స్వామి అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు.

**కోదండరామపురంలో..**

మనుబోలు : మనుబోలు కోదండరామపురంలోని పోలేరమ్మ ఆలయం, దసరా చావిడిలో అమ్మవారు బుధవారం సరస్వతీదేవి, కన్యకాపరమేశ్వరి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు శ్రీనివాసులు, సాయికుమార్ శర్మ అమ్మవారికి అలంకారాలు చేసి శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, మహిళలతో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా తమ్మిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి– రజిత, మల్లాబత్తిన వెంకురెడ్డి– సుజాతమ్మ దంపతులు వ్యవహరించారు.

**జొన్నవాడలో..**

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున సమేత కామాక్షితాయి అమ్మవారు బుధవారం సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

**పట్టణ పరిధిలో..**

బుచ్చిరెడ్డిపాళెం : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని కోదండరామస్వామి ఆలయంలో ఉన్న లక్ష్మీదేవి అమ్మవారు సరస్వతి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.


బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో..

**గంగపట్నం గ్రామంలో..**

ఇందుకూరుపేట : మండలంలోని గంగపట్నం గ్రామంలో కొలువైన చాముండేశ్వరీదేవి అమ్మవారు బుధవారం సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా స్థానికులు కేతిరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి, సంధ్య దంపతులు వ్యవహరించారు. పూలంగిసేవకు ఉభయదాతలుగా జోరేపల్లి ఫణీంద్రరెడ్డి, దివ్యారెడ్డి ఉన్నారు.

- పల్లిపాడు గ్రామంలోని మీనాక్షి సమేత రామేశ్వర వేణుగోపాలస్వామి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులను కటాక్షించారు. ఉభయకర్తలుగా చింతపంటి రాజేంద్ర– మల్లీశ్వరి దంపతులు వ్యవహరించారు.
- మైపాడులోని గ్రంథాలయం సెంటర్‌లో అమ్మవారు లలితా పరమేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శివాలయంలో పల్లకిసేవ వేడుకగా జరిపారు.


ఇందుకూరుపేట : పల్లిపాడులో..


మనుబోలు: కోదండరామపురంలో..